10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం | 26 సెప్టెంబర్ 2024 | పేజీలు 8





బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ స్థలంలో ఈనెల 10న సీసీరోడ్డు నిర్మాణ పనులు..

# అధికారులు... అక్రమార్కులు... ఏకమైతే..?

## ప్రభుత్వ భూములు కబ్జా చేయొచ్చు.. సర్కారు నిధులు దుర్వినియోగ పరచవచ్చు..

- బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో జిల్లా ఉన్నతాధికారి అండతో సీసీరోడ్డు..
- వార్తలు రాసిన విలేఖరిపై అక్రమ కేసులు బనాయించి సీసీరోడ్డు పూర్తి చేసిన వైనం..
- రూ.60 లక్షలు ప్రజాధనాన్ని దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ భూమిలో రోడ్డు..
- ప్రభుత్వ భూముల కబ్జాలకు పునాదులు వేస్తున్న రెవెన్యూ యంత్రాంగం.. బాధ్యతా రహితం కాదా..?
- అక్రమ షెడ్డుకు ప్రభుత్వ భూమిగా "2024 మే 7న" నోటీసులు జారీచేసిన తహాశీల్దార్..
- చర్యల్లేవని పలుమార్లు "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథనాలు వచ్చినా నేటికీ చర్యలు శూన్యం..
- అదే షెడ్డు పక్క నుండి ప్రభుత్వ నిధులతో కబ్జా దారులకు సీసీరోడ్డు నిర్మాణానికి కలెక్టర్ సంతకం..
- జిల్లా యంత్రాంగం ప్రజలకు ఏం మెస్సేజ్ ఇస్తున్నట్టు.. కబ్జాలు చేసుకోండి.. సహకరిస్తాం అన్నట్లా..?
- పంచాయతీరాజ్ నిర్వాహకం గుంపులో గోవిందా అన్న చందంగా ప్రభుత్వ స్థలాల్లో సీసీరోడ్లు..
- అధికారులకు, అక్రమార్కులకు లాభాదాయకంగా మారిన ఎస్‌డిఎఫ్, సిడిపి నిధులు..
- కొద్దిపాటి సహకారంతో ఇటు లక్షలు సొంతం.? అటు ప్రభుత్వ భూములు కట్టబెట్టే కార్యక్రమం పూర్తి ..?




227 ప్రభుత్వ భూమిలో ఆగష్టు 3వ తేదీ ఇలా సీసీరోడ్డు పనులు షురూ..

-2లో



227 సర్కారు స్థలంలో రూ.60 లక్షలు ప్రభుత్వ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తి..

రూ.60 లక్షల నిధులతో ప్రభుత్వ భూమి సర్వే నెం.227 గా పేర్కొన కుండా సీసీరోడ్డు ప్రొసీడింగ్..



| | | | | | |
|---|---|---|---|---|---|
| | | [illegible] Quthbullapur Constituency. | | | |
| 30 | Dundigal-Gandimaisamma (M) | Laying of Under Ground Drainage from Yadaiah (H) to Laxmareddy (H) at Mallempet Village, Dundigal - Gandimaisamma Mandal, Quthbullapur Constituency. | Gen. | 10.00 | |
| 31 | Dundigal-Gandimaisamma (M) | Laying of CC Road from Narsapur PWD Road to Plot No 193 Gayathri Nagar at Bhadurpally Village, Dundigal - Gandimaisamma Mandal, Quthbullapur Constituency. | Gen. | 60.00 | |
| 32 | Dundigal-Gandimaisamma (M) | Laying of CC Road from Tara Naik house to Open plot at Dundigal Tanda-I, Dundigal village, Dundigal - Gandimaisamma Mandal, Quthbullapur Constituency. | ST | 10.00 | DPRE P (PIU). |
| | | Laying of CC Road in ward No: 10 [illegible] | | | |

మాధవ్ పత్తి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**


తెలంగాణ రాష్ట్రం అక్రమార్కులకు, భూ కబ్జాదారులకు వేదికగా మారింది.. పలుకుబడితో పాటు తమ సామాజిక వర్గానికి చెందిన ఉన్నతాధికారి జిల్లాలో ఒకరు ఉంటే చాలు.. వేలకోట్లు విలువైన(బహుదూర్‌పల్లి 227 లాంటి) ప్రభుత్వ భూములు సైతం కబ్జా చేసుకోవచ్చు..! ధరణీ రిజిస్ట్రేషన్‌లు, పట్టా పాసు బుక్కులు, సబ్ రిజిస్టార్ కార్యాలయంలో సాయినాథ్ సొసైటీ పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసినప్పటికీ..! మొక్కుబడిగా ఒక లేఖతో మమః అనిపించవచ్చని నిరూపిస్తున్నారు.. ఎందుకంటే జిల్లా అధికారే తమవాడైతే..! నిజాయితీగా వార్తలు రాసిన విలేఖరులను కూడా బెదిరింపులకు గురిచేసే విధంగా కేసులు నమోదు చేయడం గమనార్హం.. ఇరవై ఏళ్ళుగా కేసు హైకోర్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో..! రూ.60 లక్షల సర్కారు నిధులు ఖర్చుచేసి కబ్జాదారులకు సీసీరోడ్డు నిర్మాణం పూర్తిచేసిన ఘనత మేడ్చల్ జిల్లా రెవెన్యూ యంత్రాంగానికే దక్కుతుంది.. పలుమార్లు వార్తా కథనాలతో పాటు..ఫిర్యాదులతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినా సీసీరోడ్డు నిర్మాణం, ఆపలేక పూర్తి చేయడం గమనార్హం.. ప్రభుత్వ భూమిలో 2023 అక్టోబర్ 7న శంకుస్థాపన చేసిన అదే ప్రజాప్రతినిధి చేతుల మీదుగా..!తాజాగా త్వరలో సీసీరోడ్డుకు ప్రారంభోత్సవం చేయడానికి సిద్ధమైనప్పటికీ ఆ జిల్లా ఉన్నతాధికారుల్లో చలనం లేకపోవడం విశేషం..

---

## నిర్మాణంలో ఉన్న భవనం..! అనుమతుల్లేని కళాశాల..

440 మంది విద్యార్థులను ప్రమాదంలో పెడుతున్న రెసిడెన్షియల్ కళాశాల యాజమాన్యం..

దుండిగల్ మున్సిపల్ పరిధి రింగ్‌రోడ్డు సమీపంలో కళాశాల నిర్వాహకుల కక్కుర్తి..



- గత ఆగష్టులో ఓ విద్యార్థి మృతితో బయట పడిన నిజాలు..
- ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ జాయింట్ డైరెక్టర్ వెంక్యానాయక్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు..
- స్పందించిన జాయింట్ డైరెక్టర్, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ..
- హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదంలో 440 మంది విద్యార్థులు..

-3 లో

## నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో సమీక్ష
- దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశం
- డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని సూచన

-4 లో



# అధికారులు.. అక్రమార్కులు.. ఏకమైతే..?








గత మే 7న తహశీల్దార్ నోటీసులు ఇచ్చిన అక్రమ షెడ్డు..


ప్రభుత్వ భూమిలో బౌరంపేట్ వెళ్ళే దారిలో 600 గజాలు చదుచేసి రెండు కంటైనర్లు..

- మొదటి పేజీ తరువాయి

మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం బహదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమి కబ్జాలో అధికారుల సహకారమే కనిపిస్తుంది..? సుమారు ఇరవై సంవత్సరాలుగా హైకోర్టు పరిధిలోనే కొనసాగుతుండగా..! 2009 సెప్టెంబర్ 9న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హయాంలో.. అప్పటి రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ జగన్మోహన్ ఐఏఎస్ హైకోర్టు డైరెక్షన్‌తో విచారణ జరిపారు..! బహదూర్‌పల్లి సర్వే నెం. 227 మొత్తం 353.35 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ ప్రొసీడింగ్ జారీచేశారు.. హైకోర్టు సూచించిన విధంగా సంబంధిత రెస్పాండెంట్స్‌కి ప్రొసీడింగ్ పంపించారు.. జాయింట్ కలెక్టర్ నివేదికను సవాల్ చేస్తూ ఉన్న నిర్మాణాలను కూల్చి వేయకుండా కబ్జాదారులు 2010లో మళ్ళీ హైకోర్టును ఆశ్రయించారు.. 2011లో హైకోర్టు యథాస్థితిని (స్టేటస్‌కో విధిస్తూ) కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది.. అప్పటి నుండి కేసు హైకోర్టులోనే ఉంది.. అయినా కబ్జాదారులకు సహకరిస్తూ రిజిస్ట్రేషన్లు, ధరణీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అందరికీ తెలిసిందే.. మధ్య మధ్యన అక్రమ షెడ్ల కట్టడాలు.. ప్రభుత్వ భూమిలో సర్కారు నిధులతో సీసీరోడ్ల నిర్మాణాలు.. కబ్జాదారులకు ఇన్ని సౌకర్యాలు కల్పిస్తే..! భూ కబ్జాదారుల సంఖ్య పెరగకుండా ఎలా ఉంటుంది చెప్పండి..

## సీసీరోడ్డు పూర్తయింది.. ప్రారంభానికి సిద్ధమైంది..

దుండిగల్ మండలం బహదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో ఎట్టకేలకు రెవెన్యూ అధికారుల సహకారంతో, అక్రమార్కులు అనుకున్నది సాధించారు.. రూ.60 లక్షల సర్కారు నిధులతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తయింది.. నేడో రేపో ప్రారంభోత్సవానికి కూడా సిద్ధమైందని తెలుస్తుంది.. భూ కబ్జాలకు, సర్కారు నిధులతో ఇంత మంచి సౌకర్యాలు కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని, మేడ్చల్ జిల్లా యంత్రాంగాన్ని అభినందించవచ్చని పలువురు ఎద్దేవ చేస్తున్నారు.. ఇలాంటి అధికారులు విధుల్లో ఉంటే వేలకోట్లు విలువైన ప్రభుత్వ ఆస్తులతో కబ్జాదారులు కుబేరులు అవుతారనే ఆరోపణలు లేకపోలేదు.. అసలు ఈ 227 కబ్జా తతంగం ప్రభుత్వ పెద్దల నుండే కొనసాగుతుందేమో అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు..

## 227 లో కొత్తగా కంటైనర్లతో ఆక్రమణ..

ఏదో సామెత చెప్పినట్లు "వడ్డించే వాడు మనవాడైతే– చివరి బంతైనా మొదటి బంతిలెక్కనే ఉంటుందట.. అలా ఉంది.. బహదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో గతంలో 400 గజాల్లో నిర్మించిన అక్రమ షెడ్డుకు నోటీసులు ఇచ్చి సుమారు 5 నెలలు గడిచినా చర్యలు తీసుకోకపోగా.. అక్రమార్కులకు సీసీరోడ్డు నిర్మాణానికి తహశీల్దార్ సహకరిస్తుండగా..? తాజాగా బహదూర్‌పల్లి చౌరస్తా నుండి బౌరంపేట వెళ్ళే దారిలో గత నాలుగు రోజులుగా,ప్రభుత్వ భూమిలో చదును చేసి, కంటైనర్లు ఏర్పాటు చేస్తుంటే చోద్యం చూస్తున్నారు.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్ళినా చర్యలేవు.. తాజా సమాచారం ఈ వ్యవహారంలో కింది స్థాయి రెవెన్యూ అధికారుల అండ ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి..

## ప్రభుత్వ భూమి కబ్జాని పట్టించుకోని అధికారులు..

అధికారులు.. అక్రమార్కులు ఒక్కటైతే..? యధేచ్ఛగా కబ్జాలు చేసుకోవచ్చని మేడ్చల్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం సహకారంతో తేటతెల్లం చేస్తోంది...హొదుండిగల్ గండిమైసమ్మ మండలం బహదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో పంచాయతీరాజ్ అధికారులు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షలు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డిఎఫ్) నిధులు మంజూరు చేయించారు.. పంచాయతీరాజ్ అధికారులు గుంపులో గోవిందా అన్నట్టు 57 పనుల్లో (నెం.31) నడిమిట్లో ఒకటిగా చేర్చి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిగా చూపించకుండా నిధులు సాంక్షన్ చేయించారు.. మరోవైపు రెవెన్యూ అధికారులు కూడా తక్కువేమి లేరు.. స్థానిక రెవెన్యూ అధికారి, సంబంధిత స్థలం ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ.. జిల్లా కలెక్టర్‌కి నివేదికతో సమాచారం పంపించాలి.. ఇదంతా వదిలేసి..! ప్రభుత్వ భూమిలో సీసీరోడ్డు నిర్మాణానికి సహకరించేదుకు..! నిజాయితీగా వార్తలు రాసిన విలేకరిపై కేసు నమోదు చేయించడం అధికారుల చేతివాటానికి నిదర్శనం.. కబ్జాదారులకు అధికారులు ఏవిధంగా సహకరిస్తున్నారో గమనించవచ్చు..



ఇంటర్మీడియట్ జాయింట్ డైరెక్టర్ వెంక్యానాయక్‌కి వినతిపత్రం అందజేస్తున్న స్వామి..



దుండిగల్ మున్సిపల్ పరిధి ఆశ్రమం సమీపంలో కళాశాల నిర్వహిస్తున్న భవనం..

# నిర్మాణంలో ఉన్న భవనం..!

# అనుమతుల్లేని కళాశాల

- గత ఆగస్టులో ఓ విద్యార్థి మృతితో బయట పడిన నిజాలు..
- ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వెంక్యానాయక్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు..
- స్పందించిన జాయింట్ డైరెక్టర్, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ..
- హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదంలో 440 మంది విద్యార్థులు..

**440 మంది విద్యార్థులను ప్రమాదంలో పెడుతున్న రెసిడెన్షియల్ కళాశాల యాజమాన్యం..**

**దుండిగల్ మున్సిపల్ పరిధి రింగ్‌రోడ్డు సమీపంలో కళాశాల నిర్వాహకుల కక్కుర్తి..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 25:**
విద్యాశాఖ పర్యవేక్షణా లోపం.. హెచ్ఎండిఏ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం..కళాశాల విద్యార్థులను ప్రమాదంలో పడేస్తున్నారు.. నిర్మాణ దశలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనంలో ఇంటర్మీడియట్ కళాశాల (ఎంపీసీ) తరగతులు నిర్వహిస్తూ 440 మంది విద్యార్థులను రిస్కులో పెడుతున్నారు.. ఈ విషయంపై నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌కి చెందిన స్వామి,ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ జాయింట్ డైరెక్టర్ వెంక్యానాయక్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.. స్వామి మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ కమాన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనంలో..! ఎలాంటి అనుమతి లేకుండా ఇంటర్ రెసిడెన్షియల్ కళాశాల నిర్వహిస్తున్నారు.. సుమారు 440 మంది విద్యార్థులను రిస్కులో పెట్టే విధంగా కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తున్నారని డి.స్వామి ఆరోపించారు..నిర్మాణం పూర్తి కాకుండానే బహూళ అంతస్థుల భవనంలో (2024-25) విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ తరగతులు (ఎంపీసీ) నిర్వహిస్తున్నారు..

## నిర్మాణంలో ఉన్న భవనం.. అనుమతిలేని కళాశాల నిర్వహణ..

పైగా ఈ భవనం ప్రస్తుతం నిర్మాణంలో వుండడంతో పాటు అనుమతులకు మించి అక్రమంగా అదనపు అంతస్థులు నిర్మిస్తున్నట్లు తేలిందన్నారు.. విద్యార్థులను ప్రమాదంలో పెడుతూ, నిర్మాణ సమయంలో, అదే భవనంలో రెసిడెన్షియల్ కళాశాల ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఫలితంగా సుమారు 440మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సదరు కళాశాల అనుమతులపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు..




అనుమతులకు మించి అదనపు అంతస్తులు.. అండర్ కన్‌స్ట్రక్షన్..







## విద్యార్థి ఆత్మహత్యతో.. బయటపడిన కళాశాల బండారం..

ఇదే కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థి ఫ్రెషర్స్‌డే వేడుకలకు రెండు రోజుల ముందు ఊరు, పేరులేని ఈ కళాశాలలో చదువుతున్న చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డారని స్వామి ఫిర్యాదులో తెలిపారు. అయినప్పటికీ సదరు కళాశాల నిర్వహకులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో ఒక కళాశాల నిర్వహకులే ఈ కాలేజీ యాజమాన్యంగా చెప్పుకుంటూ కళాశాల నిర్వహించడంపై ఫిర్యాదు దారుడు స్వామి అభ్యంతరం వ్యక్తం చేశాడు.. దుండిగల్ లోనూ అనుమతులు లేకుండానే తరగతులను నిర్వహిస్తున్నారని తెలిపారు.

# నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు వాటిని అప్పగించాలని సూచించారు.

**బీసీ కులగణన వేగంగా పూర్తి చేయాలి**

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. బీసీ కులగణన ప్రక్రియపై సమగ్ర అధ్యయనం అవసరమని ఈ సందర్భంగా సీఎం అన్నారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని బీసీ కమిషన్‌ను ఆదేశించారు. బీసీ కులగణను ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి విధివిధానాలను పరిశీలించాలని సూచించారు. బీసీ కులగణనను త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధివిధానాలపై సీఎంతో కమిషన్ సభ్యులు చర్చించారు.

## లాస్ వేగాస్ మైన్ ఎక్స్ పో లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్ సెప్టెంబర్ 25:** అమెరికాలోని లాస్ వేగాస్ మైన్ ఎక్స్ పో లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పాల్గోన్నారు. మైన్ ఎక్స్ పోలో 2 వేలకు పైగా ఆధునిక యంత్ర తయారీ సంస్థలు పాల్గోంటున్నాయి. 121 దేశాల నుండి 40 వేల మంది ప్రతినిధులు పాల్గోన్నారు. మూడు రోజుల ప్రదర్శనలో అత్యాధునిక, భారీ మైనింగ్ ఖనిజ ఉత్పత్తి యంత్రాలు వుంచారు. తెలంగాణ లో మైనింగ్ లో ఆధునిక సాంకేతికత వినియోగం.. ఇతర రంగాల్లో అవకాశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో అధ్యయనం చేయనున్నారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఇతర అధికారులు వున్నారు. మైనింగ్ సాంకేతికతలపై అధ్యయనానికి తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉన్నత స్థాయి బృందం ఈ కార్యక్రమానికి హాజరయింది.

## చౌటపల్లిలో చోరీ


**సూర్యాపేట, పెన్‌పవర్ సెప్టెంబర్ 25:** మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామం లో ఓ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు, బంగారం చోరీ చేశారు. మోదుగు జాన్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉదయాన్నే పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తాళం పగల కొట్టి ఉంది. బీరువాలో ఉన్న 10వేల నగదు, రెండు ఉంగరాలు, రెండు జతల దిద్దులు చోరీ కి గురైె అయినట్టు గుర్తించారు. పోలీసులు పిర్యాదు చేసినట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు వెల్లడించారు.

# పరిపాలనలో కృత్రిమ మేధా పాత్రపై.. పోస్టర్ పోటీ..


### ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని, మనస్విత చికిలేకి ప్రథమ బహుమతి..



ప్రథమ బహుమతి పొందిన విద్యార్థిని మనస్విత చికిలే..







KASTURBA GANDHI DEGREE & PG COLLEGE FOR WOMEN
WEST MARREDPALLY, SECUNDERABAD, TELANGANA - 500026
(Sponsored & Managed Jointly by the Osmania Graduates' Association and The Exhibition Society, Hyderabad)
GOLDEN JUBILEE CELEBRATIONS
DEPARTMENT OF POLITICAL SCIENCE

This is to certify that Mr/Ms. Manasvitha of Govt. Degree College for Women has achieved 1st position in **Poster Making** competition on the Topic **"Artificial Intelligence as a tool for Good Governance".**

Date : 25th September 2024

Dr.Rajshree.R
Convenor & Principal

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ అండ్ పి.జి కళాశాల రజతోత్సవ సంబురాల్లో భాగంగా రాజనీతి శాస్త్రం శాఖ నిర్వహించిన "పరిపాలనలో కృత్రిమ మేధా పాత్ర"పై నిర్వహించిన పోస్టర్ పోటీలో బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని, గాజులరామారం డివిజన్, శ్రీరామ్ నగరకు చెందిన మనస్విత చికిలే ప్రథమ బహుమతి గెల్చుకుంది.. కృత్రిమ మేధను సమర్ధ వంతంగా వాడుకుంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, సమాచార గొప్యత, రోబోటిక్స్, భద్రత, సుస్థిర అభివృద్ధి, పారదర్శకత, జవాబుదారితనం మరియు అందరికి అందుబాటులో ప్రభుత్వ సేవలు లాంటివి పొందవచ్చని అన్నారు.. ఈ సందర్భంగా మనస్విత చికిలేకి మంచి భవిష్యత్తు ఉందని, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలు చేసి మరెన్నో బహుమతులు, పురస్కారాలు పొందాలని కోరుతూ మనస్వితకు బంధు మిత్రులు అభినందనలు తెలిపారు..

# కడియం నర్సరీల ప్రాంతానికి "చిరుత"


### ఆలమూరు, మండపేట ప్రాతాల వాళ్లు కూడా అప్రమత్తంగా ఉండాలి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 25:** రాజమహేంద్రవరం దివానచెరువు అభయారణ్యం ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత గత మూడు రోజులుగా జాడ లేకపోవడం తెలిసింది. అయితే మంగళవారం రాత్రి కడియం నర్సరీ ప్రాంతాల్లో చిరుత జాడ కనిపించిందని అడవి శాఖ అధికారులు ధ్రువీకరించారు. దాంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దివానచెరువు ప్రాంతం నుంచి ఈ చిరుత కడియం ప్రాంతానికి వచ్చినట్లు కాలి ముద్రల ద్వారా అధికారులు నిర్ధారించారు. అయితే కడియం- వీరవరం రోడ్ మధ్యలో ఉండే దోషాలమ్మ కాలనీలో ఈ చిరుత జాడలు కనిపించడంతో ఆ కాలనీ వాసులంతా తీవ్ర భయాందోళన చెందారు. అడవి శాఖ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి చిరుత జాడల ఉన్నట్లు గుర్తించారు. అది అక్కడి నుంచి ఎక్కడికి వెళ్ళింది అనేది అంతుపట్టడం లేదు. కొన్ని నర్సరీలలో సీసీ కెమెరాలు ఉంటాయి. కాని ఇప్పుడు అందరూ భయపడి రైతులు ఎవరు నర్సరీలో ఉండడం లేదు. దీంతో చిరుత ఆ ప్రాంతంలోనే ఉందా అక్కడి నుంచి సమీపమైన ఆలమూరు లేదా మండపేట మండలాల పరిధిలోకి వెళ్ళిందా అనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది. గంటకు సుమారు 100 కిలోమీటర్ల వేగంతో పయనించే ఈ చిరుత ఎప్పుడు ఎక్కడికైనా వెళ్లగలగే అవకాశం ఉంటుంది. ఏదేమైనాప్పటికీ ఈ ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అడవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎవరూ బయటకు రావద్దని, ఇంటి బయట లైట్లు వేసి ఉంచాలని, దగ్గరగా ఉండే మైకులు పలుకుతూ ఉండాలని సూచించారు.

# అటో.. ఇటో పరిస్థితి ఎటూ..?

# గోడ దూకిన ఎమ్మెల్యేలు..




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు.. నేతల గోడ దూకుళ్ళు సర్వసాధారణం.. ఈ తంతు ఎన్నికలు పూర్తై, ఫలితాలు వచ్చిన తర్వాత కూడా అడపా దడపా జరుగుతూనే ఉంటాయి. ప్రస్తుత రోజుల్లో అయితే.. ఈ వ్యవహారాన్ని జనాలు సైతం చాలా లైట్‌గా తీసుకుంటున్నారు. కానీ గోడదూకిన ఎమ్మెల్యేలు? అటో, ఇటో తెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడటం ఏదైతే ఉందో? అదేఇప్పుడు తెలంగాణ రాజకీయాల్ని నిప్పుల కుంపటిలా ఉడికిస్తోంది. కండువా మార్చి, ప్రభుత్వంలో కీలక పదవి దక్కించుకున్న ఆ జంపింగ్ ఎమ్మెల్యేకి.. తాను ఏ పక్షాన ఉన్నానో కూడా చెప్పుకునే పొజిషన్ లేకుండా పోయిందట.తెలంగాణలో మరోసారి ఫిరాయింపుల రాజకీయం రచ్చరేపుతోంది. ఇటీవల జరిగిన సీఎల్పీ భేటీలో? శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యక్షమవడంతో.. ఈ వ్యవహారం మరోసారి టాప్‌న్యూస్‌లో నిలిచింది. కొద్ది రోజుల క్రితం ఫిరాయింపుల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ ల మధ్య రచ్చ రాజకీయ వర్గాలలో తీవ్ర దుమారం లేపింది. బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, ఆరికెపుడు గాంధీ, ప్రకాష్ గౌడ్ లతోపాటు మొత్తం పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద లు హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను కలసి వినతి పత్రం ఇచ్చినా ఆయన పట్టించుకోట్లేదని హై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదును విచారించిన కోర్టు నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ కార్యాలయానికి సూచించింది. ఈ వ్యవహారంలో ఆరికెపుడు గాంధీ స్పందిస్తూ నేను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదు, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే పాడి కౌశిక్ రెడ్డి అరికెపుడి గాంధీ ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పుతానని చెప్పడంతో, దమ్ముంటే మా ఇంటికి రావాలి.. లేదంటే నేను కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్తానని సవాల్ విసిరారు. అంతేకా? ఏకంగా కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లి మరీ అనుచరులతో ఇంటి మీద హంగామా చేశాడు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వ్యాఖ్యలపై ఆరికెపుడిగాంధీ స్పందించనప్పటికి మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సీఎల్పీ సమావేశం జరిగిన మాదాపూర్ ప్రాంతం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఉంది. కాబట్టి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశాడు. దానికి ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నారని శ్రీధర్ బాబు మండిపడ్డారు. ఇదంతా ఒకెత్తైతే మాదాపూర్ లో జరిగిన సీఎల్పీ మీటింగ్ కి ఆరికెపుడు గాంధీ హాజరయ్యారు. ఇక్కడే అసలు ట్విస్ట్ నెలకొంది. గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరనప్పుడు సీఎల్పీ సమావేశానికి ఎలా వెళతారనేది ప్రతిపక్షాల ఆరోపణ. హరీష్ రావు కూడా ఇప్పటికే కౌంటర్ స్టార్ట్ చేశారు.వివాదం నుంచి బయటపడేందుకు, తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని చెప్పుకొన్న అరెకపూడి గాంధీ.. ఇప్పుడు సీఎల్పీ భేటీలో పాల్గొనడం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. కాంగ్రెస్‌లో చేరినట్టు గతంలో ఎక్స్‌లో పోస్టు చేసిందీ ఆయనే.. పబ్లిగ్గా ప్రకటించిందీ ఆయనే? ఆ తర్వాత పీఏసీ చైర్మన్ పదవి విషయంలో వివాదం చెలరేగడంతో తాను కాంగ్రెస్‌లో చేరలేదన్నదీ ఆయనే? ఇప్పుడు కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీకి హాజరైందీ ఆయనే.. కానీ, ఇప్పటికీ ఆయన అటో, ఇటో అన్నది మాత్రం ఎవ్వరికీ అర్థం కావడం లేదు. తానెటువైపనే విషయాన్ని గాంధీ కూడా గట్టిగా చెప్పలేని పరిస్థితి. పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీతో పాటు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, డాక్టర్ సంజయ్‌కుమార్, ప్రకాష్ గౌడ్‌లు అటెండ్ అయ్యారు. ఈ ఇష్యూపై బీఆర్ఎస్ మరోసారి గళమెత్తుతోంది. కాంగ్రెస్‌లో చేరలేదని శాసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన కామెంట్స్ అబద్ధాలు అంటూ ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు.అయితే దీనికి మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. హరీష్ రావుకు కౌంటర్ ఇచ్చారు. సీఎం తన నియోజకవర్గానికి వచ్చినందుకే..అరికెపూడి గాంధీ వచ్చి కలిశారే తప్ప.. సీఎల్పీ సమావేశానికి హాజరు కాలేదన్నారు. మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ సమావేశానికి రాలేదని.. కేవలం సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి వెళ్లారని చెప్పుకొచ్చారు. సిద్ధిపేట నియోజకవర్గానికి సీఎం వెళ్తే.. కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొనరా అంటూ శ్రీధర్‌బాబు ఎదురు ప్రశ్నించారు.అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా ఫిరాయింపుల అంశం కుతకుతలాడుతోంది. గాంధీభవన్ వేదికగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశాల్లో వివాదం రాజుకుంటోంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు.. గాంధీభవన్‌లో జరిగిన సమీక్షా సమావేశాలకు హాజరయ్యారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశానికి కడియం శ్రీహరి, కరీంనగర్ జిల్లా సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, నిజామాబాద్ జిల్లా సమావేశానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అయితే కరీంనగర్ జిల్లా సమావేశం కాస్త రసాభాసా జరిగింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పేర్ల జాబితాలో పార్టీ సీనియర్ నేత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేరు పొందుపరచలేదు. అదే సమయంలో పార్టీ ఫిరాయించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేరును ప్రస్తావించారు. దీంతో జీవన్ రెడ్డి పార్టీ పెద్దల తీరుపై గరం అయ్యారు. జరిగిన తప్పును గ్రహించిన పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. ఏదో పొరపాటు వల్ల పేరు పడలేదని..జరిగిన దానికి సారీ చెప్పి.. మరోసారి ఇలాంటి తప్పిదం జరగదని సర్దిచెప్పారు. శనివారం గాంధీభవన్ జరిగిన పరిణామాల నేపథ్యంలో.. ఆదివారం జరిగిన సీఎల్పీ సమావేశానికి జీవన్ రెడ్డి డుమ్మా కొట్టారుఇలా పార్టీ ఫిరాయింపుల అంశం హస్తం పార్టీలో ఎన్నో సమస్యలకు దారి తీస్తుంది. బీఆర్ఎస్ మాత్రం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత కోసం గట్టి ఆధారాలు సేకరించే పనిలో బిజీగా ఉంది. గాంధీభవన్‌లో జరిగే సమావేశాలకు..సీఎల్పీ భేటీకి ఫిరాయింపు ఎమ్మెల్యేలు హాజరైన ఎవిడెన్స్‌ను సేకరించి కోర్టుల దృష్టికి తీసుకెళ్లాలని చూస్తోంది. మరోవైపు ఈ వ్యవహారం నుంచి తప్పించుకునేందుకు టెక్నికల్ అంశాలపై కాంగ్రెస్ ఫోకస్ చేసింది. డైలీ ఎపిసోడ్‌లా కొనసాగుతున్న ఈ ఇష్యూ ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదు. అయితే ఫైనల్‌గా ఎవరు పైచేయి సాధిస్తారనేది మాత్రం హాట్ టాపిక్‌గా మారింది.

# హైడ్రా లో అసలు దోషులు సేఫ్...

# తప్పు ఎవరిది..? శిక్ష ఎవరికి




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 25:** హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలతో ఎవరు ఎక్కువగా నష్టపోతున్నారు ?. ఈ ప్రశ్నకు సమాధానం.. మధ్యతరగతి ప్రజలే. ప్రభుత్వ స్థలాలు, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కడుతున్న కట్టడాలు అన్నీ రాజకీయ నేతలు, వారి బినామీలవే. వారు మాత్రమే అందర్నీ మేనేజ్ చేసి..అన్ని అనుమతులు తీసుకు రాగలరు. సామాన్యులకు సాధ్యం కాదు. కానీ అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పి.. వీరిని ఆ రాజకీయ నేతలు, బినామీలు నమ్మించి మొత్తం అంటగట్టేస్తారు. ఎంతగా అంటే లోన్లు ఇప్పిస్తారు. రిజిస్ట్రేషన్లు కూడా చేయిస్తారు. కానీ ఎక్కడో సర్వే నెంబర్ గోల్ మాల్ చేసి.. మొత్తానికి ముంచేస్తారు. ఇప్పుడు అదే జరుగుతోంది. ప్రభుత్వంలో ఉన్న వారు..రాజకీయ నేతలు ముఠాగా ఏర్పడి పేద, మధ్యతరగతి ప్రజల సొంత ఇంటి కలను ఆసరాగా చేసుకుని దోచుకున్నారు. ఇప్పుడు అన్నీ కూల్చేశారు. తప్పు ఎవరిది..? శిక్ష ఎవరికి పడుతుంది ?కొంత విరామం తర్వాత ఆదివారం కిష్టారెడ్డిపేట. పటేల్ కూడ, కూకట్ పల్లి నల్ల చెరువు ప్రాంతాల్లో కూల్చివేతలు చేసింది. ఆ సమయంలో బాధితుల వేదన వర్ణనాతీతం. ఎందుకంటే.. వాటన్నింటినీ కబ్జా చేసి అమ్ముకున్నవారు అడ్రస్ లేకుండా పోయారు. రూపాయి రూపాయి పోగేసుకుని కొనుక్కున్న వారో.. లీజుకు తీసుకున్నవారో నష్టపోయారు. పటేల్ గూడలో కూల్చిన ఇళ్లకు మూడు రోజుల కిందట రిజిస్ట్రేషన్ చేశారు. ఇవాళ కూల్చేశారు.రిజిస్ట్రేషన్ చేసి మరీ కూల్చడం అంటే.. ప్రభుత్వాన్ని నమ్మిన వారిని వంచించడమే. ఇలాంటి తప్పులు ఎక్కడ జరుగుతాయో.. దానికి కారణం ఎవరో ప్రభుత్వానికి తెలుసు. కానీ బాధితు?లుగా చివరి కొనుగోలుదారులే మిగులుతున్నారు. ఆ కూల్చివేతలతో తమ సమస్తం కోల్పోతున్నామని వారు ఎంత ఆవేదన చెందినా ప్రయోజనం ఉండటం లేదు. కిష్టారెడ్డిపేటలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. దానికి పట్టాలిచ్చారు. లోన్లు వచ్చేలా చేశారు. కానీ.. అది ప్రభుత్వ భూమి అని అందరకీ తెలుసు. మరి అనుమతులు ఎలా ఇచ్చారు. రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి?. అంతా చేసేసి కొనుగోలు దారులకు నష్టం జరిగేలా కూల్చివేయడం అంటే ద్రోహం చేస్తున్నట్లే లెక్క. ఇరప్పుడు ప్రభుత్వం ఆ భూముల్ని కబ్జా చేసి అమ్ముకున్న వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి... చివరి కొనుగోలుదారులకు ఇవ్వాలి. వారికి నష్టం జరగకూండా చూడాలన్న భావన ఏర్పడుతోంది. ఎందుకంటే ఈ పాపంలో ప్రభుత్వానికీ భాగం ఉంది. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వంలో భాగమే . వారు తప్పు చేస్తే ప్రభుత్వం తప్పు చేసినట్లే. ఆ తప్పులకు ప్రజల్ని బాధ్యు?ల్ని చేయలేరు. అందుకే.. ఇలా ఇళ్లు నష్టపోతున్న ప్రతి ఒక్కరికీ వారి సొమ్ము వారికి వెనక్కి ఇచ్చే ఏర్పాట్లు చేయాలి. అలా చేస్తేనే మరోసారి కబ్జా చేసి అమ్ముకునేవాళ్లు కూడా ఆలోచిస్తారు. మరోసారి ఎప్పుడైనా కట్టాల్సి వస్తుందని కంగారు పడతారు. ఓ ప్రభుత్వ భూమిలో అపార్టుమెంట్లు కట్టే వరకూ వ్యవస్థలు ఏమి చేస్తాయి.. ఆ ఆపార్టుమెంట్లకు హోమ్ లోన్లు వచ్చేలా డాక్యుమెంట్లు రెడీ అయ్యేదాకా ఏమి చేస్తారు ?. ఇలా చేయడం అంటే.. ఖచ్చితంగా ప్రభుత్వ లోపం ఉన్నట్లే. దానికి ప్రజల్ని శిక్షించలేరన్నది ఎక్కువ మంది చెప్పేమాట . హైడ్రాకు సూపర్ వపర్లు ఇచ్చిన ప్రభుత్వం.. కూల్చి వేతలకు.. కేసులకే కాదు.. నష్టపోతున్న మధ్యతరగతి ప్రజలకు.. అధికారుల మోసాలకు బలైపోయిన పేదలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రజావిశ్వాసాన్ని ప్రభుత్వం కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

# భారీగా 400 కోట్ల ఆదాయం...తగ్గని రియల్ ఎస్టేట్ వ్యాపారం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 25:** హైడ్రా? ఇప్పుడు తెలంగాణతోపాటు దేశంలో ఎక్కడ చూసినా ఈ అంశంపైనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి ఆట కట్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు నెలల క్రితం హైడ్రాను ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా గ్రేటర్ హైదరాబాద్ లో చెరువుల ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. బడాబాబులు మొదలు సామాన్యుల వరకు చెరువులను ఆక్రమించి కట్టిన కట్టడాలన్నింటిని నేలమట్టం చేస్తోంది హైడ్రా. ఈ క్రమంలో ఇప్పటివరకు సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది హైడ్రా. ఈ పరిస్థితుల్లో హైడ్రాకు మరిన్ని అధికారులు కట్టబెట్టడంతోపాటు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించింది ప్రభుత్వం. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయింది. ఆస్తులు కొనాలంటే ప్రతిఒక్కరూ భయపడిపోతున్నారు. దాంతో నిర్మాణ రంగం పూర్తిగా మందగమనంలోకి పడిపోయింది. చాలా వరకు సర్వేలు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నారు. అక్రమ లే అవుట్లతో ప్రజలు ఆగం కాగా.. ఇప్పుడు కొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తే ఎప్పుడు ఎలాంటి నోటీసులు అందుకోవాల్సి వస్తుందోనని ఆందోళనలతో ఉన్నారు..ఐతే క్యాబినెట్ భేటీలో హైడ్రాపై చర్చ సందర్భంగా మంత్రుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. హైడ్రాపై ప్రజల్లో ఓవైపు ప్రశంసలు వస్తుండగా.. మరోవైపు వ్యతిరేకత వ్యక్తమవుతోందని కొందరు మంత్రులు సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా హైడ్రా పనితీరుపై సామాన్యుల్లో ఆందోళనలను ఒకరిద్దరు మంత్రులు సీఎం రేవంత్ రెడ్డికి చెప్పారట. హైడ్రా ఏర్పాటు తర్వాత.. రిజిస్ట్రేషన్ల ద్వారా సమకూరే ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయిందనే విషయాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పై హైడ్రా తీవ్ర ప్రభావం చూపుతోందని, హైడ్రా ఎఫెక్ట్ తో గ్రేటర్ లో నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతింటుందేమోననే అభిప్రాయాన్ని కొందరు మంత్రులు కేబినెట్ సమావేశంలో వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. హైడ్రా దూకుడు ప్రభావం రిజిస్ట్రేషన్లపై స్పష్టంగా కనిపిస్తోందని మంత్రివర్గం సమావేశంలో ఓ సీనియర్ మంత్రి గుర్తు చేశారని తెలుస్తోంది. హైడ్రా ఎఫెక్టుతో ఆగస్టులో సుమారు 400 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందని సదరు మంత్రి ఆవేదన వ్యక్తం చేశారట. హైడ్రా పనితీరుతో గ్రేటర్ హైదరాబాద్ లో నిర్మాణ సంస్థలు, బిల్డర్లు కొత్త నిర్మాణాలపై అనుమతులు తీసుకోవడానికి జంకుతున్నారన్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారట మరో సీనియర్ మంత్రి. ఇలాంటి సమయంలో హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, చట్టబద్ధత కల్పిస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఒకరిద్దరు మంత్రులు క్యాబినెట్ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారని సమాచారం. హైడ్రా మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసినా, అది ప్రభుత్వ భూములను రక్షిస్తున్నా.. అదే సమయంలో ఎదురవుతున్న ప్రతికూలతలను సైతం పరిగణలోకి తీసుకోవాలని మంత్రులు సూచించారని తెలుస్తోంది. హైడ్రాపై మంత్రివర్గ సహచరుల అభిప్రాయాలు, సూచనలను సావదానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అంతే సూటిగా స్పష్టంగా సమాధానం చెప్పారని సమాచారం. రాష్ట్రంలో హైదరాబాద్‌లోనే రియల్ వ్యాపారంతో ఆదాయం ఎక్కువ. రిజిస్ట్రేషన్లు ఎన్ని జరిగితే ప్రభుత్వానికి అంతలా ఆదాయం పెరుగుతుంది. కానీ.. హైడ్రా ఎఫెక్ట్‌తో రిజిస్ట్రేషన్లు చాలా వరకు తగ్గిపోయాయి. దాంతో ప్రభుత్వ ఆదాయం కూడా కాస్త మందగించినట్లుగానే తెలుస్తోంది. నిజానికి ఏటా దసరా, దీపావళి వేళ హైదరాబాద్‌లో ఇళ్లు సేల్స్ ఎక్కువగా కనిపిస్తాయి. చాలా మంది ఇళ్లు కొనాలనుకునే వారు ఈ రెండు పండుగలను బేస్ చేసుకొని కొంటుంటారు. కానీ.. ప్రస్తుత పరిస్థితులు అలా కనిపించడం లేదు. కొత్త ఇల్లు కొనేందుకు ఎవరూ సాహసించడం లేదు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే కరోనా సమయంలోని పరిస్థితులనే చూడాల్సి వస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు.. రేవంత్ రెడ్డి సర్కార్ ముందు కూడా ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సి ఉంది. అటు.. గత ప్రభుత్వం చేసిన అప్పులనూ మోయాల్సి ఉంది. కానీ.. ఈ సమయంలో ఆయన హైడ్రాను తీసుకురావడం కూడా సంచలనంగా మారింది. హైదరాబాద్ నగరంలో 42 శాతానికి ఇళ్ల అమ్మకాలు పడిపోయాయంటే ముందుముందు మరిన్ని భయంకర పరిస్థితులు తప్పవేమో అన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. వీటన్నింటిని కాదని రేవంత్ సర్కార్ కూడా ఎలా ముందుకు వెళ్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో హైడ్రాపై ఏ మాత్రం వెనక్కి తగ్గేది లేదని, ఆ సంస్థకు పూర్తిస్థాయి అధికారాలు కట్టబెట్టి, చట్టబద్ధత కల్పించడంలో వెనకడుగు వేసేదే లేదని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి ఆక్రమణలకు గురైన చెరువులను, కుంటలను కాపాడటంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఓ మంచి పని చేసే సమయంలో కొంత నష్టం తప్పదని మంత్రులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారట సీఎం రేవంత్ రెడ్డి. హైడ్రా ముఖ్య ఉద్దేశం, భవిష్యత్తు తరాలకు జరిగే మంచి గురించి ప్రతి సందర్భంలోను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలని మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ సూచించినట్లు సమాచారం. మొత్తానికి హైడ్రాపై రియల్ ఎస్టేట్ ఆదాయం తగ్గినా.. ముఖ్యమంత్రి మాత్రం భవిష్యత్ తరాల బాగు కోసం ఏ త్యాగమైనా చేయాల్సిందేనని తేల్చి చెప్పారట. దీంతో మంత్రులు కూడా ఇంక చేసేదేమీ లేక హైడ్రాకు జైకొట్టారని టాక్.

# పచ్చని కాపురంలో చిచ్చుపెట్టిన పోలీస్ కానిస్టేబుల్




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ మహబూబ్ నగర్, సెప్టెంబర్ 25:** నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి.. నాలుగు నెలల కిందట తన స్నేహితురాలితో కలిసి జర్నీ చేస్తున్నారు. ఈ క్రమంలో నాగర్ కర్నూల్‌లోని మెయిన్ రోడ్డు పక్కన కారు ఆపి.. దాంట్లో భోజనం చేస్తున్నారు. ఈ సమయంలో ఓ కానిస్టేబుల్ అటుగా వచ్చారు. కారులో ఉన్నవారి ఫొటోలు తీశారు. ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించి.. భయభ్రాంతులకు గురిచేశాడు. అంతటితో ఆగకుండా.. తన దగ్గర ఉన్న ట్యాబ్‌లో నుంచి ఫొటో తొలగించాలంటే రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసు నమోదు చేస్తానని బెదిరించారు. దీంతో భయపడిన ఆ వ్యక్తి రూ.2 వేలు ఇచ్చేందుకు ఓకే చెప్పారు. వెంటనే తన స్నేహితుడి ఫోన్‌పేకి ఆ కానిస్టేబుల్ రూ.2 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అక్కడితో ఆగలేదు. కానిస్టేబుల్ తీసిన ఆ ఫొటోను తొలగించలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ ఫొటోను బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న మరో కానిస్టేబుల్‌కు పంపించారు. అతను కూడా ఫొటోతో బ్లాక్ మెయిల్ చేశాడు. డబ్బులు ఇవ్వాలని బాధితుడిని బెదిరించాడు. దీంతో చిరాకు వచ్చి.. బాధితుడు డబ్బులు ఇవ్వబోనని స్పష్టం చేశారు. దీంతో కానిస్టేబుల్ ఆ ఫొటోను బాధితుడి భార్యకు చూపించాడు. కానిస్టేబుల్ చేసిన ఈ పనితో.. భార్యాభర్తల మధ్య గొడవలు స్టార్ట్ అయ్యాయి. వీరి గొడవను పెద్దలు కూర్చొని సెట్ చేశారు. ఈ వ్యవహారం.. సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ ఘటన గురించి నాగర్ కర్నూల్ సీఐ కనకయ్యకు తెలిసింది. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారణ అయితే.. ఆ ఇద్దరి కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకుంటామని సీఐ కనకయ్య స్పష్టం చేశారు. ఈ విషయం తెలిసి బిజినేపల్లి ప్రజలు భగ్గుమంటున్నారు. పోలీసులు మరీ ఇంత దిగజారిపోయారేంటని చర్చించుకుంటున్నారు. ఇదొక్కటే కాదు.. పోలీసులు డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయని చెబుతున్నారు. సదరు కానిస్టేబుళ్ల బాధితులు చాలామంది ఉన్నారని అంటున్నారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పందించి.. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కృష్ణయ్య దారెటు...




ఆర్.కృష్ణయ్య


**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 25:** రాజ్యసభ సభ్యత్వానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. నిన్న ఆర్.కృష్ణయ్య రాజీనామా లేఖను రాజ్యసభ ఛైర్మన్‌కు పంపగా, దాన్ని ఛైర్మన్ ఆమోదించారు. వైసీపీ నుంచి 2022లో ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు ఎన్నికయ్యారుతన పదవీ కాలం మరో నాలుగేళ్లు ఉండగానే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. ఇప్పటికే రాజ్యసభ సభ్యత్వాలకు బీద మస్తాన్‌రావుతో పాటు మోపిదేవి వెంకటరమణ కూడా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. బీసీ ఉద్యమాన్ని ఉద్ధృతం చేసేందుకే రాజీనామా చేసినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని విస్తరించడంపై ఆర్.కృష్ణయ్య దృష్టిపెట్టారు. కాగా, త్వరలోనే బీజేపీలో చేరతారని ఇటీవల ప్రచారం జరిగింది. తెలంగాణలో బీసీ ఓటు బ్యాంకును మరింత పెంచుకునే దిశగా బీజేపీ దృష్టి సారించింది. దీంతో ఆర్.కృష్ణయ్యతో బీజేపీ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. బీజేపీలో ఆర్.కృష్ణయ్యకు కీలక పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# 1979 నాటి మ్యాప్స్ తో హైడ్రా...

**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ హైదరాబాద్, సెప్టెంబర్ 25:** విశ్వనగరం హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా మార్చాలన్న సంకల్పంతో ఉన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇందుకు ముందుగా నగరానికి ముంపు ముప్పు తప్పించాలని భావిస్తున్నారు. చిన్న వర్షం పడినా రోడ్లు చెరువులను తలపించే పరిస్థితి మారాలన్న లక్ష్యంతో హైడ్రా ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడడంతోపాటు, చెరువులు, కుంటలను రక్షించడం, ప్రజలను విపత్తు నుంచి కాపాడడం దీని లక్ష్యం. ప్రస్తుతం ప్రధానంగా చెరువులు, కుంటలను పునరుద్ధరించే పని చేపట్టింది హైడ్రా, కమిషనర్ రంగనాథ్ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఎవరి ఒత్తిడీ తలొగ్గకుండా తన పని తాను చేసుకుపోతున్నారు. వ్యూహాత్మకంగా ఆక్రమ నిర్మాణాలపైకి బుల్డోజర్లను పంపుతున్నారు. ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా చెరువులు, కుంటల భూమిని రికవరీ చేశారు. ఇక కోర్టు కూడా హైడ్రా విషయంలో పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. చాలా మంది కోర్టును ఆశ్రయిస్తుండడంతో హైడ్రాకు సీఎం మరిన్ని అధికారాలు అప్పగించడంతోపాటు చట్ట బద్ధత కల్పించేలా చర్యలు చేపడుతున్నారు.ఇక ఆక్రమిత స్థలాల్లో అనుమతులు ఇచ్చిన అధికారులపైనా హైడ్రా కమిషనర్ చర్యలకుదిగుతున్నారు. ఇప్పటికే ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో చాలా మంది అధికారులు ఆందోళన చెందుతున్నారు. కొందరు అధికారులు చెరువులు, కుంటల హద్దులను తప్పుగా చూపించే ప్రయత్నం మొదలు పెట్టారు. హద్దులను కొత్తగా చూపించే మ్యాప్‌లు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆక్రమణదారులకు రక్షణతోపాటు, తమకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. కానీ, రంగనాత్.. అంతకు మించి ఆలోచన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాయంతో 45 ఏళ్లనాటి ఉపగ్రహ చాయాచిత్రాలు సేకరించే పనిలో పడ్డారు. ఈమేరకు హైడ్రా, ఎన్‌ఆర్‌ఎస్సీ మధ్య త్వరలోనే ఒప్పందం జరుగనుంది. ఇప్పుడు చర్యలు తీసుకోకపోతే.. నగరంలో ఉన్న అరకొర చెరువులు కూడా మిగలవన్న భావనలో ప్రభుత్వం కూడా ఉంది. ఉన్న చెరువులను కాపాడేలా హైడ్రా చర్యలు చేపడుతోంది.గతలో చెరువులు, కుంటలు ఎలా ఉండేవో తెలిసేలా మ్యాప్‌లు కావాలని రంగనాథ్ ఇటీవల ఎన్‌ఆర్‌ఎస్సీ అధికారులను కోరారు. ఇటీవల బాలానగర్‌లోని కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో మాట్లాడారు. చెరువుల సంరక్షణకు ఎన్‌ఆర్‌ఎస్సీ సాయం కోరారు. చెరువుల హద్దులను చూపించే స్పష్టమైన పటాలు ఇవ్వాలని కోరారు. దీంతో హద్దులు చెరిపేసినా గుర్తించే వీలుంటుందని తెలిపారు. అధికారికంగా మ్యాప్‌లు కొంటామని తెలిపారు.ఇదిలా ఉంటే ఎన్‌ఆర్‌ఎస్సీ సంస్థ ఇప్పటికే హైడ్రాకు 56 చెరువుల పటాలు అప్పగించింది. 1979 నుంచి 2023 మధ్య చెరువులు ఎలా ఆక్రమణకు గురయ్యాయో చూపేలా చిత్రాలు ఉన్నాయని తెలుస్తోంది. అనేక చెరువులు కొన్ని రోజుల్లోనే కనుమరుగైనట్లు గుర్తించారు. ఆయా పటాలు మరింత పక్కాగా సేకరించి హద్దులు నిర్ణయించాలని రంగనాథ్ భావిస్తున్నారు




# రైతులకు తీపి కబురు: త్వరలోనే రైతు భరోసా, పంట నష్ట పరిహారం





హైదరాబాద్ పెన్ పవర్: రైతులకు మంత్రి కొండా సురేఖ తీపి కబురు చెప్పారు. త్వరలోనే రైతు భరోసా, వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ లో ఇవాళ (సెప్టెంబర్ 25) అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. జీలుగ విత్తనాలు రైతులందరికి అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఎరువుల కొరత ఉందని హరీష్ రావు తమ దృష్టికి తీసుకొచ్చారని.. వెంటనే చర్యలు తీసుకుని ఎరువుల కొరత లేకుండా స్టాక్ పెట్టాలని అధికారాలను ఆదేశించారు. ఫసల్ బీమా విషయంలో కేంద్రం నుండి నిధులు వచ్చేలా స్థానిక బీజేపీ ఎంపీ రఘునందన్ రావు చొరవ చూపాలని కోరారు. హామీ ఇచ్చినట్లుగా సన్న వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున ఈ సీజన్ నుండే ఇస్తామని తెలిపారు. చేప పిల్లలు ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించి.. వారి చేత చేప ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయించాలన్నారు. గృహ లక్ష్మీ పథకంలో ఆలసత్వం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సర్పంచ్ లు లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు తెలుసుకుందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

# కాంగ్రెస్ రూ.54 కోట్ల ప్రజాధనం కాపాడిందని కేటీఆర్ తెలుకోవాలి





**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ నేత కేటీఆర్ మాట్లాడుతున్న అమృత్ 2.0 కాంట్రాక్ట్ 2023 సెప్టెంబర్ లోనే రూ. 3656 కోట్లకు జరిగిందనే విషయాన్ని ఆయన తెలుసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అనంతరం డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రీటెండర్లను నిర్వహించి రూ. 54 కోట్లను తగ్గించి రూ. 3602 కోట్లకు కాంట్రాక్టులు అప్పగించారని వెల్లడించారు. రూ. 54 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం కాపాడిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది ఏండ్లు దోచుకున్న కేటీఆర్.. పది నెలలుగా అధికారం లేక దోచుకోవడానికి వీలు కావట్లేదని అందుకే ఆయన ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావట్లేదని అన్నారు. గత సెప్టెంబర్ లోనే ఈ కాంట్రాక్టును కేటీఆర్ మిత్రులైన ఏపీ ఎంపీ మిథున్ రెడ్డి, సత్యం రామలింగ రాజు కొడుకుకి, మెగా కృష్ణారెడ్డికి మూడు ప్యాకేజీల ద్వారా టెండర్ ఇచ్చారని తెలిపారు. కమిషన్లకు అలవాటు పడిన కేటీఆర్ ప్రాజెక్టులు వాళ్ల చేతుల నుంచి పోవడం మింగుడు పడకుండా ఉందన్నారు. పైసలకు అలవాటు పడిన కేటీఆర్ రోజు ఏదో ఒక విషయంలో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. పదేండ్లు అధికారంలో ఉండి దోచుకు తిని 7 లక్షల కోట్లు అప్పుచేశారని.. అయినా ఇంకా సరిపోవట్లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేటీఆర్ మంచి ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తే ప్రజలు మెచ్చుకుంటారని హితవు పలికారు.

## 63 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం.. ఈ గుట్ట.. ఆ ఊరికే ఎట్రాక్షన్..!



**హైదరాబాద్ పెన్ పవర్:**కాగజ్‌నగర్ పట్టణానికే స్పెషల్ ఎట్రాక్షన్ త్రిశూల్ పహాడ్ గుట్ట .. దీని చుట్టూ పచ్చని అందాలు,.. నిలువెత్తులో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం చూడ్డానికి రెండు కళ్లు చాలవు. అంతేకాదు ఈ గుట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా కూడా విలసిల్లుతోంది. ఎన్నో ఆలయాలు ఉన్నాయి ఇక్కడ, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు కొత్తవాళ్లు ఎవరొచ్చినా ఈ గుట్ట చూడాల్సిందే.

త్రిశూల్ పహాడ్ గుట్టపై ఏర్పాటు చేసిన 63 ఆ అడుగుల అంజనేయ స్వామి నిలువెత్తు విగ్రహం ఇక్కడ స్పెషల్ ఎట్రాక్షన్. ఈ విగ్రహాన్ని కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామిని దర్శించుకు నేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వస్తుంటారు.అంతకాదు.. పండుగ రోజుల్లో... ముఖ్యమైన రోజుల్లో అక్కడ ప్రత్యేక పూజల చేస్తారు. అన్నదాన కార్యక్రమం చేస్తారు.

**పంచ ఆలయాలు**

గుట్టపై అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. నిలువెత్తు అభయాంజయస్వామితో పాటు సత్యనారాయణ స్వామి, దుర్గామాత.. గణేశ్, సాయిబాబా ఆలయాలు ఇక్కడ ఉన్నాయి. ఈ దేవాలయాల్లో ప్రతిరోజు జరిగే పూజలను చూసేందుకు భక్తులు , పట్టణ ప్రజలు వస్తుంటారు. అప్పుడప్పుడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేస్తుంటారు.

**ఎటు చూసినా పచ్చదనమే**

త్రిశూల్ పహాడ్ గుట్ట వర్షాకాలంలోనే కాదు అన్ని కాలాల్లో పచ్చని చెట్లతో కళకళలాడుతుంటుంది. గుట్టు చుట్టూ అనేక రకాల వృక్షాలు ఉన్నాయి. వాటి మధ్య 'శ్రీకృష్ణగోశాల' ఉంది. ఇందులో రెండు గుర్రాలు కూడా పెంచుతున్నారు.

**రావణదహనం**

ప్రతిఏటా దసరా వేడుకలప్పుడు ఇక్కడ 'రావణ దహనం' నిర్వహించడం అనవాయితీ. అందుకోసం త్రిశూల్ పహాడ్ గుట్టపైన ప్రత్యేకంగా రావణుడి. విగ్రహ ఆకారాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ గుట్ట మీద పరిసరాల్లో జవహర్ నవోదయ విద్యాలయం. ప్రభుత్వ ఆఫీసులు కూడా ఉన్నాయి. దాంతో ఇక్కడ రోజూ సందడిగా ఉంటుంది.

## పార్టీలోకి వచ్చిన నాలుగేళ్లలో సీఎం కావడం చరిత్రలో లేదు... కానీ రేవంత్ రెడ్డి అయ్యారు: వీహెచ్

**హైదరాబాద్ పెన్ పవర్:**పార్టీలోకి వచ్చిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి కావడం ఇక్కడి చరిత్రలో లేదని, కానీ రేవంత్ రెడ్డి అయ్యారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి హనుమంతరావు అన్నారు. హోటల్ హరిత ప్లాజాలో కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ పెంపుపై రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ... బీసీ నేతను పీసీసీ చీఫ్‌గా చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. తన రాజకీయ జీవితంలో బీసీల గురించి రాహుల్ గాంధీ మాట్లాడినట్లు ఎవరూ మాట్లాడలేదన్నారు.జనాభా ప్రాతిపదికన ఎవరి హక్కులు వారికే దక్కాలని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు. కులగణన చేయాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీజేపీని కోరినప్పటికీ పట్టించుకోలేదని విమర్శించారు. తెలంగాణలోని ఆరు డిక్లరేషన్లతో పాటు బీసీ కులగణన చేపడతామని పార్టీ చెప్పిందన్నారు. బీసీ డిక్లరేషన్ అనగానే గత ఎన్నికల్లో కులాలకు అతీతంగా ఓటు వేశారన్నారు.కులగణన చేయాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిపై ఉందన్నారు. రేవంత్ రెడ్డి పక్కన చెప్పేవారు ఎక్కువ అయ్యారని పేర్కొన్నారు. అసెంబ్లీలో బీసీ కులగణన బిల్లు పాస్ అయిందని, త్వరలో మనకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ: లోన్లు తీసుకోవడానికి మీ దగ్గర ఉన్న ఆస్తులు ఏంటని అధికారులను అడగ్గా..



**హైదరాబాద్ పెన్ పవర్:**కాగ్ రిపోర్టులో ఒకటి రెండు అంశాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయని, మూడు బ్యారేజీల ఎస్టిమేషన్స్ ను తాము ముందే ఆడిట్ చేశామని, కాగ్ రిపోర్టుతో తమకు సంబంధం లేదని కాళేశ్వరం ప్రాజెక్టు అకౌంట్స్ ఆఫీసర్లు కమిషన్ కు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణలో భాగంగా ముగ్గురు అకౌంట్స్ ఆఫీసర్లు కమిషన్ ముందు బుధవారం హాజరయ్యారు. కాళేశ్వరం కార్పొరేషన్ మాజీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట అప్పారావు, ఇరిగేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి, వర్క్స్ అండ్ అకౌంట్ డైరెక్టర్ మణిభూషణ్ శర్మపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. ఏ ప్రాతిపదికన లోన్లు తీసుకుంటారని కమిషన్ ప్రశ్నించింది. ప్రభుత్వం నుంచి అప్రూవల్ వచ్చిన తర్వాతనే కార్పొరేషన్ లోన్ కు వెళ్తుందని ఈ అధికారులు చెప్పారు. అందుకు అనుగుణంగానే తమకు నీటిపారుదల శాఖ కార్యదర్శి ఆదేశాలిస్తారని చెప్పుకొచ్చారు.

నాబార్డ్ నుంచి అప్పులు తీసుకున్నామని వెంకట అప్పారావు కమిషన్ కు తెలిపారు. అప్పుడు ఇరిగేషన్ సెక్రటరీగా రజత్ కుమార్ ఉన్నారని వివరణ ఇచ్చారు. పెద్ద మొత్తంలో లోన్లు తీసుకోవడానికి మీ వద్ద ఉన్న ఆస్తులు ఏంటని పీసీ గోష్ ప్రశ్నించారు. తమ వద్ద ఎలాంటి ఆస్తులు లేవని అకౌంట్స్ ఆఫీసర్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే తప్ప తమ వద్ద ఆస్తులు ఉండవని స్పష్టం చేశారు. రామగుండం, ఎన్ టీపీసీ నీళ్లను సరఫరా చేయడం ద్వారా వచ్చే ఆదాయంతోనే మెయింటెనెన్స్ చేస్తామని వివరణ ఇచ్చారు. తీసుకున్న లోన్లను బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేశామని, దానిపై వచ్చిన వడ్డీలను మెయింటెనెన్స్ కోసం వినియోగించామని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్టు ప్లానింగ్ కంటే ముందే లోన్ తీసుకోవాలని డిసైడ్ అయ్యారా అని చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతిని పీసీ గోష్ ప్రశ్నించారు. ప్రాజెక్టు సీఈలు తమకు ప్రతిపాదనలు పంపుతారని, వాటిని ఈఎన్సీలు ఆమోదిస్తారని, ఆ తరువాతనే తాము బడ్జెట్ ప్రిపేర్ చేస్తామని పద్మావతి సమాధానం ఇచ్చారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రభుత్వం ఎలాంటి కేటాయింపులు చేయలేదని పద్మావతి చెప్పారు. మీరు తీసుకున్న అప్పుల్ని బడ్జెట్లో చూపించారా అని కమిషన్ ప్రశ్నించగా, చూపించలేదని పద్మావతి చెప్పడం గమనార్హం. కమిషన్ ప్రశ్నలకు తన పరిధిలో లేని అంశాలంటూ మణి భూషణ్ శర్మ సమాధానం దాటవేశారు. కమిషన్ విచారణకు కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీ అండ్ ఈఎన్సీ హరి రామ్, మేడిగడ్డ ఎస్సీ సర్దార్ ఓంకార్ సింగ్ హాజరు కాలేదు.

# మీకు తెలుసా : 2 వేల సంవత్సరాల నాటి బుగ్గ ఆలయం.. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణలోనే ఉంది..



**హైదరాబాద్ పెన్ పవర్:**రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఆలయం ఇది. దీని గురించి ఈ ఏరియాలో తెలియనివాళ్లు ఉండరు. చోళ రాజుల కాలంలో ఈ బుగ్గ రాజేశ్వరాలయాన్ని కట్టించారు. ఇక్కడికి ఎక్కడెక్కడినుంచే లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఆహ్లాదకరమైన వాతావరణం భక్తులను కట్టిపడేస్తుంది.మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లికి దగ్గరలో బుగ్గరాజరాజేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ దేవాలయానికి చుట్టుపక్కలరాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తారు. ఈ దేవాలయంలో జాతర జరిగే రోజుల్లో లక్షలాది మంది స్వామిని దర్శించుకుంటారు. భక్తులు రాత్రి దైవసన్నిధిలో నిద్ర చేసి, ఉపవాస దీక్షలను విరమిస్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎడ్లబండ్లపై వచ్చి ఎంతో నిష్టతో ఉండి ఇష్టదైవాన్ని ఆరాధిస్తారు. ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకుని తిని, ఇళ్లకు ప్రయాణం అవుతారు.

**ఈ ఆలయంలో ప్రత్యేకత ఏంటంటే**

గర్భగుడిలోని శివలింగంపై నిరంతరంగా గంగాజలం పడుతుంటుంది. మహిమాన్వితదృశ్యాన్ని చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. అయితే ఈ గంగాజలం వెనుక పెద్ద కథే ఉంది. అదేంటంటే.. పూర్వకాలంలో దేవతాసంభూతుడైన ఆఘోర యోగి పుంగవుడు చిత్రకూట పర్వత శ్రేణుల నుంచి ఈ ప్రాంతానికి వచ్చాడని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఇక్కడ తపన్సు చేసుకుంటూ .. కాశీకి వెళ్లి వస్తుండేవాడు. ఆ యోగికి ఉన్న శక్తుల వల్ల 60 గడియలోనే(24 గంటలు) కాశికి వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఇలా కొన్నేళ్ల తర్వాత ఆ యోగికి వృద్ధాప్యం వచ్చింది. దాంతో ఒక రోజు కాశీకి వెళ్లలేక బాధపడ్డాడు. స్వామి నన్ను మన్నించు" అని ఏడుస్తూ. శివుడిని ధ్యానిస్తూ నిద్రలోకి జారుకున్నాడు. అప్పుడు ఆ యోగి భక్తికి మెచ్చి రాజరాజేశ్వరుడు ప్రత్యక్షమై 'ఇకపై నీవు కాశీకి రానవసరం లేదు. నేను నీ కోసం ఇక్కడే కొలువై ఉంటాను. మూడు గుట్టల నుంచి లిప్తకాలం పాటు కూడా ఆగకుండా వస్తూ గంగ నన్ను సేవిస్తుంది. అని చెప్పి మాయమైపోయాడు. అని స్థానికులు చెప్తారు. అందుకే శివలింగంపై గంగాజలం ఆగకుండా పడుతుందంచారు.

**ఆహ్లాదకరంగా...**

ఆధ్యాత్మికతతో పాటు ఈ ప్రాంతం భక్తులకు, ప్రకృతి ప్రేమికులకు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. ఆంజనేయస్వామి. అయ్యప్పస్వామి మాలధారణ చేసే భక్తులు కూడా ఇక్కడే ఉంటారు. రాజరాజేశ్వరుడి గుడి పక్కవ ఎప్పుడూ ప్రవహించే నీటి ఊట కోనేటిలో పడుతుంటుంది. ఇక్కడికి వచ్చే భక్తులు ఆ కోనేరులో పుణ్యస్నానాలు చేస్తారు. ఇక్కడి ప్రకృతి అందాలు భక్తులను, పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. గుడికి ఎదురుగా ఎత్తైన పచ్చని గుట్ట, గుడి వెనుక రెండు గుట్టలు ఎంతో అందంగా కనిపిస్తాయి. గుడి చుట్టూ ఆకాశానికి నిచ్చెన వేసినట్లు కనిపించే ఎత్తైన చెట్లు ఉన్నాయి. ఆ చెట్ల నీడ కింద భక్తులు. పర్యాటకులు వంటలు చేసుకుని, తిని ఆనందంగా గడుపుతారు.

**ఎలా వెళ్లాలి**

బుగ్గరాజరాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేందుకు ప్రత్యేకంగా రవాణా సదుపాయం లేదు. ఆలయానికి వెళ్లాలి అనుకునే వాళ్లు ముందుగా బెల్లంపల్లికి రావాలి. బెల్లంపల్లి పాతబస్టాండ్ నుంచి ఆటోలు ఉంటాయి ఆటోలో ఏడు కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. ఆలయానికి వెళ్లేందుకు ప్రత్యేకంగా రోడ్డు కూడా ఉంది.